ముత్యాల సరాల వంటి స్వీయ కవితా కుసుమాలు మీ ముందుకు తీసుకుని రావటానికి అవకాశమిచ్చినందుకు ముందుగా సుప్రభ గారికి ధన్యవాదాలతో.

ఈ రచనల మీద సకల హక్కులు రచయిత్రి గారివే అని, ఎవరయినా ఇవి వాడుకోదలిస్తే ముందస్తుగా వారి అనుమతి తీసుకోవలసినదిగా సభాముఖంగా విన్నవించడమయినది. వీటిలో కొన్ని యాహూ గ్రూప్స్ లోని రచ్చబండలో కూడా ప్రచురించబడినాయి అని తెలియచెయ్యడమయినది.

ఈ కవితా సంపుటిలోని మొదటి భాగము చదువుకుని ఆనందించండి.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## సంక్షిప్తంగా సుప్రభ గారి జీవిత చరిత్ర వారి మాటల్లోనే

గుంటూరు సీమలో గోవాడ గ్రామాన
ఉప్పల వంశాన నుద్భవించి
కోటయ్య కన్నాంబ కూతునై బెరుగుచు
సీత ఓ సోదరై చెలిమి జూప
చౌదరి అన్నయై సంతోషమీయగా
కృష్ణకు మారి తా కీలుగొనుచు
చెల్లిగా నలరించ చిన్నతనమునందు
కొంటె కృష్ణులరీతి కొమరు మిగిలి
రంజిల్లజేయగా రాజీవనేత్రులౌ
యిద్దరు తమ్ములు నిలను నపుడు
ఆట పాటల తోడ నలరారి నిత్యమ్ము
బాల్యమ్ము గడిపి "ప్రభావతి"గను
తెలుగు పండితునిగా తీయన్ని స్వరముతో
తేనెలొలికెడియా తెలుగు నంత
తండ్రియే గురువుగా తగురీతి నేర్పగా
పాఠశాలలయందు పరిఢవిల్లి,
కొన్నేళ్ళు చదువుకై గుంటూరు, బెజవాడ
పట్టణాల గడిపి వాణి దయను
విద్యపూర్తిని జేసి వేగ విశాఖలో
చేకొని డిగ్రీని చిత్తమలర
హాయిగా రెండేళ్ళు ఆ కళాశాలలన్
బోధించి బోటనీ ముదము మీర



PDF created with pdfFactory trial version www.pdffactory.com

శ్రీవారిగా నేను చేపట్టి బావనే
అడుగు బెట్టితినాడు అమెరికాలో
అన్నదమ్ములతోడ అమ్మయున్ ,చెల్లియు
నందరు నరుదెంచ నమెరికాకు
పద్మజ,జగదీష్ లు బాల చేష్టలతోడ
మురియజేసెడి వేళ, ముద్దుగా ప్ర
శాంతిదీపిక వచ్చి *సరసన జేరుచు
నందరి ప్రేమమ్ము నందుకొనగ
పాతికేండ్లకు పైన పరుగెత్తి పోయేను
కాలమంత వడిగ కనులముందె.

గడువబోదని జెప్ప కాలమ్ము ఒకరీతి
సిరియు తానెచటికో తరలి వెళ్ళ
చేతనైనట్టిదో చిన్ని యుద్యోగమున్
చేసికొంచు గడుప జీవితమ్ము
గూడుగట్టిన బాధ గుండెనంతయు దొల్వ
వెలికంప దలచెనో విధియె యనగ
కన్య రాశిని యున్న గ్రహములేవియొ తాము
కవిత లల్లెడిశక్తి కలుగ జేయ
పూర్వ జన్మము నేదొ పూజజేసితినంచు
ఫలితమీయగ నెంచి వసుధ నిపుడు
అంబ వాణియు వచ్చి ఆదరమ్మునుజూపి
యనిశ మీయెద బల్కి యలరజేసి
సడలించి బంధాలు, సారసాక్షి పయికి



PDF created with pdfFactory trial version www.pdffactory.com

మనసునంతయు వేగ మరలజేసి,
ఛందమించుక నేర్పి, డెందమ్ము పొంగించ
పలుకు లాడుచు నుండ ప్రతిదినమ్ము ,
భాష నేర్వగ లేదను బాధ యున్న
తల్లి యిచ్చిన వరముతో తనివి నొంది
ఉన్న పలుకులే గూర్చుచు నుచితరీతి
పద్య మాలల నల్లుచు పరవశించి
తల్లి యానతి తలదాల్చి ధరణి నిపుడు
సుప్రభాఖ్యనై బరగుచు, శుభ మటంచు
పంచి పెట్టేను వాటినే పదుగురికిని.

తల్లి దండ్రియు గురువును తానె యగుచు
నేర్ప దలచిన దేదియో నేర్పి వేగ
నెయ్యమును జూపి కరుణించు నీరజాక్షి
జీవితము నంత నీరీతి సీసమందె
కూర్చి కుదియించి పంపగా కూతుకిటుల
నందజేసెను పలుకుల నర్ధరాత్రి

సుప్రభ
**1-17-99**
**(early morning hours)**



PDF created with pdfFactory trial version www.pdffactory.com



## శారదాస్తుతి

## దండకము

శ్రీ శారదాంబా మనోభీష్టదాత్రీ పిశాలాక్షి పీణాధరీ
వాణి వాగీశ్వరీ వేదరూపా తమోభంజనీ గీతసంగీత
సమ్మోదినీ మోహనిర్మూలినీ వ్యోమసంచారిణీ శ్వేతపద్మాలయా
శుభ్రవస్త్రావృతా చంద్రబింబాననా అక్షమాలాధరీ
చారు మూర్తీ సుగాత్రీ సుకేశీ సుహాసీ మనోరంజనీ
జ్ఞానదాత్రీ సపిత్రీ నమస్తే నమస్తే నమస్తే నమః.

-సుప్రభ-



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## అరుగు మీది పెద్దలకు

-----------------------

మొదటి కానుక

ఉత్సాహ

నచ్చినట్టి చోటు యనుచు నడచి వెళ్ళి మెల్లగా
రచ్చబండ కాడ జేరి రావి చెట్టు చెంత నీ
పిచ్చినట్టి పలుకు తోడ వృత్తమేదొ కూర్చుచున్
వచ్చినట్టి రాగమందు పాడుకొనుచు నుండగా

వచ్చి ఒకడు పోకిరాయి పడుచు వాడు చెంతకున్
పిచ్చిదానివనుచు నన్ను వెక్కిరించి వెళ్ళగా
కచ్చ బుట్టి కలము దీసి కైత రూపమందునే
యిచ్చ వచ్చినట్లు దిట్టి యింటికొచ్చి వేగమే

అచ్చ తెలుగు పద్యమనుచు, అలర జేయు నంచు ,ఆ
"రచ్చబండ" కంపినాను వ్రాసినవవి పద్యముల్ :-)
మెచ్చుకొనుచు వేగ తాము మెడలు నొకటి యిత్తురో
పిచ్చి పిచ్చి కైతలనుచు వేస్తు నందు వేతురో!)-:

సుప్రభ
**2-21-2000**
**(early morning)**

రచ్చబండ" గ్రూపు ప్రారంభించిన సమయములో అమ్మ
అందజేసినది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## రారాదా..

-------------

పెలపెల బోయెను తెరయంతా
కలములు ప్రక్కన అట నుంచి
తెలుగులు అంతా నిదురించ..
మా తెలుగులు అందరు..నిదురించ

చదువుట కొకటీ కనరాదు
ఎడదను ఊపే కవితేదీ
ముదమును గూర్చె పలుకేదీ
నీవే గతియిక శ్రీవాణీ..
నీవే గతియిక శ్రీ వాణీ..

తెలతెల వారెను చూడండీ
మగతను వీడి లేవండీ
పలుకుల వర్షము కురిపింతు
కలముల దీయుడు వెలికంటూ

నిదురను లేపి వడివడిగా
కొడుకుల కూతుల కందరకూ
కాఫీ టీలవి యందించి
ఉప్మా దోసెల దినిపించి



PDF created with pdfFactory trial version www.pdffactory.com

పద ములు నేవో కురిపించి
కల ముల నుంచి కర ములలో
కదలగ జేయగ రారాదా
కవితల వ్రాయగ శ్రీవాణీ
వెలుగగ మరలా తెర యంతా
వెలుగగ మరలా తెర యంతా

సుప్రభ
2-18-2000
( morning-in the car )



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# వచ్చేడమ్మా..

--------------

వచ్చేడమ్మా నేడు
కొండను వీడుచు శివుడు
ముంగిట నిలిచెను చూడు
భిక్షాం దేహీ యంటూ
నా.. ముంగిట నిలిచెను చూడు

లోకాలేలే ప్రభువు
ఆకలి యంచూ తనకు
వాకిలి ముందర నిలిచె
నా వాకిలి ముందర నిలిచె
చేతిలో చిప్పొకటుంచి
ఆ.. చేతిలో చిప్పొకటుంచి..
యీ వాకిలి ముందర నిలిచె

అమరులమేమీ కాదు
అమృతమేదో యిచ్చి
స్వామికి తృప్తిని గూర్చ
ఆ.. స్వామికి తృప్తిని గూర్చ
పాయసమైనా లేదే
పావక లోచనుకిడగా
అతిథివి యంటూ పిలిచి
ఆదరమెంతో చూపి



PDF created with pdfFactory trial version www.pdffactory.com

అన్నము కూరా తప్ప
యుతరము లేనే లేదు
ఇంటిని నేడిట మాకు
ప్రేమతో యొసగగ తనకు

అలుగును ఏమో తల్లీ
పలుకులనైనా యీవే
ప్రస్తుతి జేయుచు వేగ
పొంగగ జేతును శివుని
గంగను దాల్చిన పిభుని
ఆ గంగను దాల్చిన ప్రభునీ..

సుప్రభ
2-17-2000
(in the car-morning)



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## ఒక మాటంటే..

-----------------

### భుజంగప్రయాతము

అహంకార మున్నేదొ అన్నానటంచున్
అహంభావమున్ బాప నందించినావా
ప్రహారంబు నీరీతి రాజీవనేత్రీ
మహాత్మ్యంబు జూపించి మందిచ్చు నూహన్ !

అహంకారినేంగాదు.. అజ్ఞాన మేమో
మహోదారభావాన మన్నించి కూతున్
సహాయంబు నందించి సంతోషమీవే
సుహాసమ్ముతో వాణి, చూపించి దారిన్

ఒకే మాటతో, ఉన్న ఉద్యోగమేదో
థకీమంచు పోగొట్టి, ఠారెత్త జేస్తూ
బుకాయించు చుండేవ పూబోడి పైగా !
ఇకే మంచు వాదింతు నీవేళ నీతో?

ఎదన్ బల్కి నిత్యంబు నెంతెంతొ కూర్మిన్
పదంబిట్లు రాల్చేను ..పైనెందు కంటే,
ముదంబిచ్చునే గాని ముద్దెట్టు దంటూ
మదిన్ నప్పినానంచు, మారాడితంచున్



PDF created with pdfFactory trial version www.pdffactory.com

వృథా జేసి నేజూపు ప్రేమంబునంతా
హృదిన్నుంచ బోకుండ యీబిడ్డ ఫూజల్
కథన్ మార్చి వేసేవ కన్నీరు జిందన్ ?
వ్యథన్ దీర్చు భారమ్ము నందింతు నీకే!!

మథించేవు యీగుండె మాటంటినంచున్
సుధాపాత్ర మేదమ్మ? చూపింప వమ్మా?
ఎదన్ జేర్చి వేవేగ యీకూతు నింకన్
యథారీతి జూపించి యాప్రేమనంతా
కథన్ మార్చవే తల్లి కారుణ్యమూర్తీ..
కథన్ మార్చవే తల్లి కారుణ్యమూర్తీ..

సుప్రభ
**2-22-2000**

ధనము గూర్చి ఆలోచిస్తే అమ్మ నాదగ్గర నుంచి వెళ్ళిపోతుందేమోననే తలపుతో మూడేండ్లు ధనము/ప్రతిఫలము తీసికోకుండా అర్ధరాత్రి వేళ లేచి రెండు పార్ట్ టైం ఉద్యోగాలు జేసి, ఒకరోజు ఇంట్లో వత్తిడికి తట్టుకోలేక అమ్మతో అన్నాను. "ఇన్నాళ్ళూ నీకోసమని యిలా చేశాను. కాని యిక అలా జేయలేని పరిస్థితి.వెళ్ళి నాకు రావలసిన డబ్బుల గురించి యత్నించాలి". ఆమాటలని పగటిపూట జేస్తున్న ఫుల్ టైం ఉద్యోగానికెళ్ళాను. అరగంటలో ఆ ఉద్యోగము ఊడిపోయింది. దానిని గురించి అమ్మతో జరిగిన సంభాషణ పై విధంగా పద్యరూపంలో బెట్టించింది.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# నీవున్న చోటే..

--------------------

నీవున్న చోటే బృందావనం
నీనోటి మాటే మురళీరవం
నీనోటి మాటే మురళీ రవం

కనిపించకున్నా కమనీయ రూపం
వినిపించకున్నా నీ వేణుగానం

మదిలోన నిలిచే యీ మూర్తి నీదే
ఎదలోన వెలిగే యీ మూర్తి నీదే
ఈ మూర్తి నీదే....

ఏదూర తీరాల పలికేనో మురళి
యీ దేహమంతా పులకించు నిదిగో
పులకించు నిదిగో..

చిరుగాలి తరగలు తెచ్చేనో ఏమిటో
మధురాతి మధురమౌ నీ మురళి రవమది

తనువెల్ల పులకలై.. మనసంత మధురమై
కను మూసి నిలిచితీ.. నీరూపు దలచితీ..



PDF created with pdfFactory trial version www.pdffactory.com

పినిపించె సవ్వడి.. వెనువెంటె వడివడి
చిరుగజ్జె సందడి.. మురిపించ నామది

వెనుదిరిగి జూచితీ.. వెనుదిరిగి జూచితీ
కనిపించ రెవ్వరూ,..కనుచూపు మేరలో

వినిపించుచున్ననూ ఆ వేణుగాన మూ...

సుప్రభ
**2-22-2000**
**( in the car )**



PDF created with pdfFactory trial version www.pdffactory.com

# జలజల రాలే...

---------------------

జలజల రాలే చినుకును నేను
గలగల పారే ఏరును నేను
అలలతో పొంగే కడలిని నేను
అందరు కోరే జలమును నేను

మనుజులకైనా మెకములకైనా
చెట్టులకైనా పిట్టలకైనా
దప్పిక దీర్చే జలమును నేను

భూమిని ఉన్నా మట్టిని కలసి
నింగిని ఉన్నా మబ్బులో దాగి
మధ్యలో ఉన్నా గాలిని గూడి
అంతట ఉన్నా ఆకృతి మార్చి
అందరు కోరే జలమును నేను

తీయటి రసముగ నొకచోట
ఉప్పటి నీరుగ నొకచోట
తెల్లని మంచుగ నొకచోట
నల్లని నీటిగ నొకచోట



PDF created with pdfFactory trial version www.pdffactory.com

స్వచ్ఛము గాను నొకచోట
పంకిలమగుచు నొకచోట
తేలెడి గడ్డగ నొకచోట
రాలెడి రేకుగ నొకచోట

ఆవిరి రూపున నొకచోట
ఆరని తడిగా నొకచోట
మెల్లగ సాగుచు నొకచోట
వెల్లువ యగుచూ నొకచోట

తిన్నగ ఉరుకుచు నొకచోట
సన్నని గొందుల నొకచోట
వెచ్చని యూటగ నొకచోట
పచ్చని నదిగా నొకచోట

చీకటి గుహలో నొకచోట
వెలుతురు బయలున నొకచోట
అందని యెత్తున నొకచోట
క్రిందకు దుముకుచు నొకచోట

ఉడుకుచు కుతకుత నొకచోట
బుడబుడ పొంగుచు నొకచోట
పరుగులు దీయుచు నొకచోట
నిలకడగాను నొకచోట



PDF created with pdfFactory trial version www.pdffactory.com

ఎల్లెడనుండే జలమును నేను
ఎల్లరు కోరే జలమును నేను

వానగ వచ్చి వరదగ పొంగి
పట్టగ లేని యురవడి తోడ
చెట్టుల రాల్చి గట్టుల ద్రుంచి
ఇళ్ళను గూల్చి ఊళ్ళను ముంచి
అల్లరి జేసి ఆరటి నిచ్చి
ఇష్టము వచ్చిన రీతిని యంతా
విహారణ జేసే జలమును నేను

అందరు కోరే జలమును నేను
ఎల్లెడ నుండే జలమును నేను...

సుప్రభ
**2-21-2000**
**( morning - in the car )**



PDF created with pdfFactory trial version www.pdffactory.com

## విరిసెను హృదయము లోన

------------------------

మధ్యాక్కర

అరుణిమ నింపుచు నచట ఆకసమంతయు నెదుట
గిరిపయి లేచెను అడుగో కిరణములంపుచు సూరి
ధరణియు పొంగిన రీతి తరువుల వన్నియు నూపు
కరముల వడివడి నదిగో కనులకు పండువు కాగ

గగనము పైనను కొన్ని ఖగములు బారులు దీర్చ
దిగువను నేలను నుండి తిండికి వెదుకును కొన్ని
పగతుడు వచ్చెను అనుచు వగపును బొందినయట్లు
నగుపడ బోకను రేయి అవ్వలి తీరము కేగ

కలువల రాయడు తాను కలవరమొందిన రీతి
వెలవెల బోవుచు నిలువ వేరొక దిశనట దివిని
తెలితెలి వెలుగుల జిమ్మి తేజము నింపుచు నంత
వెలుగుల రేడట సాగ విభవము జూపుచు మిగుల

ధర పయి తెలితెలి మంచు తపనుని కాంతిని మెఱియ
గిరి పయి సాగెడి మొయిలు, కిరణము లిచ్చెడి వేడి
తెరువుల ప్రక్కన తరులు, తెలియని హాయిని రేప
విరిసెను హృదయము లోన వేడుక జేయగ ప్రకృతి



PDF created with pdfFactory trial version www.pdffactory.com

---

విరిసిన యెడదను గాంచి విద్యల తల్లియు నవ్వి
కరుణను జూపుచు మదిని కవితకు పదముల నీయ
చిరుచిరు పదముల కచట చేర్చుచు యతులను నేవా
పరుగుల దీసెను కలము పద్యము రూపము నీయ

సుప్రభ
**2-23-2000**
**( morning in the car )**



PDF created with pdfFactory trial version www.pdffactory.com